

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 14.05.2026 | సంపుటి: 3 | సంచిక: 102 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 14.05.2026 | V0LUME : 3 | ISSUE : 102 | PAGES: 8 | COST: 2/- |

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

# నగరాన్ని వణికిస్తున్న నేపాలీ గ్యాంగ్!

- ఖరీదైన ఇళ్లలో పనికి చేరి ప్రాణాలు తీస్తున్న ముఠాలు
- అదును చూసి యజమానుల ప్రాణాలు తీస్తున్న వైనం
- హైదరాబాద్ మహానగరంలో వరుస దోపిడీలు
- రిటైర్డ్ డీఐజీ భార్య హత్యతో వణికిపోతున్న నగరం
- ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులే టార్గెట్
- తక్కువ జీతానికి వస్తున్నారనే ఆశే యజమానుల పాలిట శాపం
- ఇంట్లోని గుట్టు తెలుసుకున్నాకే దోపిడీలకు స్కెచ్
- పోలీసులకు వివరాలు ఇవ్వాల్సిందే..

**తెలంగాణ బ్యూరో, మే 13(రాజముద్ర న్యూస్) :**
హైదరాబాద్ మహానగరం ఇప్పుడు ఒక తెలియని భయం గుప్పిట్లో బతుకుతోంది. విశ్వసనీయమైన పనిమనుషులు అనుకుని ఇంట్లోకి ఆహ్వానిస్తే, వారే యమపాశాలై ప్రాణాలు తీస్తున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా నేపాలీ ముఠాలు నగరంలోని సంపన్న వర్గాలను టార్గెట్ చేస్తూ వరుస దోపిడీలకు, హత్యలకు పాల్పడుతుండటం సంచలనంగా మారింది. వృద్ధాప్యంలో పనిమనిషి సాయం కావాలనుకునే ధనవంతులే ఈ కిరాతకుల ప్రధాన లక్ష్యంగా మారుతున్నారు. ఈ ముఠాలు పక్కా ప్రణాళికతో ఇళ్లలోకి చేరి, అదును చూసి ఘాతుకాలకు పాల్పడుతున్నాయి.

వరుస దోపిడీలు.. హత్యలు

నగరంలో ఇటీవల జరిగిన రెండు ప్రధాన నేరాలు నేపాలీ గ్యాంగ్ పనేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నగలు, నగదు కోసం ఒక రిటైర్డ్ పోలీస్

మిగతా 3వ పేజీలో..






## ట్యాపింగ్ కేసులో కీలక మలుపు?

- ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో 12 మంది బీఆర్ఎస్ నేతల పేర్లు?
- అగ్రనేత కుటుంబ సభ్యుల పాత్రపై సిట్ ఫోకస్
- 1300 ఫోన్ల ట్యాపింగ్ వివరాల నమోదు
- జడ్జిలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల సమాచార సేకరణపై ఆరోపణలు

**తెలంగాణ బ్యూరో, మే 13 (రాజముద్ర న్యూస్):**
తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను అరెస్ట్ చేసి విచారణ జరిపిన సిట్ బృందం ఇప్పుడు రాజకీయ కోణంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో 12 మంది బీఆర్ఎస్ నేతల పేర్లు చేర్చే అవకాశముందని ప్రచారం జోరుగా

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

- ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్
- సీఎం తో ఉబెర్ సీఈఓ భేటీ

**తెలంగాణ బ్యూరో, మే 13 (రాజముద్ర న్యూస్) :**
ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా

మిగతా 2వ పేజీలో..



మెగా గ్రోత్ కారిడార్‌తో **తెలంగాణకు కొత్త దిశ** 2



## బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

- విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలి.. టీఆర్ఎస్ చీఫ్ కవిత
- పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై ప్రధాని నోటి వెంట ఒక్క మాట రాలేదు
- సీఎం రేవంత్ రెడ్డి అడగలేదు.. బీఆర్ఎస్ ప్రశ్నించలేదు
- ప్రధాని ఆంధ్రాకు పైసలు ప్రకటించి... మనకు పొదుపు సూత్రాలు చెప్పిండు
- నీళ్ల కోసమే ఏర్పడిన తెలంగాణలో మన వాటాను కూడా వాడుకోలేని దుస్థితిలో ఉన్నాం
- మమ్మల్ని ప్రజలు ఆశీర్వదిస్తారు.. అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తాం

2



## కఠిన చర్యలు తీసుకుంటాం

- డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు
- బక్రీద్ సందర్భంగా పోలీసు అధికారులతో వీసీ

3

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ

3



# 15న విచారణకు హాజరవుతా

- సిట్ అధికారులకు లేఖ పంపిన బండి భగీరథ్
- వ్యక్తిగత కారణాలతో గడువు కోరిన కేంద్రమంత్రి కుమారుడు
- కీలక ఆధారాలతో వస్తానని వెల్లడి
- దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని స్పష్టం

**తెలంగాణ బ్యూరో, మే13 (రాజముద్ర న్యూస్) :**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ సిట్ అధికారులకు లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం బషీరాబాద్ పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 15న విచారణకు హాజరవుతానని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా పంపించినట్లు సమాచారం. విచారణకు హాజరయ్యే సమయంలో కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, సాక్ష్యాలను

మిగతా 3వ పేజీలో..



పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు 3



## బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఆ కేసులో ఎలాంటి జాప్యం లేదు
- బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం
- కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి
- ఎస్ ఐ ఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోంది

3

## పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల గొంతు కోస్తున్నారు

- నీట్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వంపై పొంగులేటి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని వెల్లడి
- బీఆర్ఎస్ హయాంలోనూ ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయని విమర్శ
- పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వ్యాఖ్య
- ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

3





## సరస్వతి అంత్య పుష్కరాలకు రండి

- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానించిన దేవాదాయ అధికారులు

**తెలంగాణ బ్యూరో, మే13 (రాజముద్ర న్యూస్):**
ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి

మిగతా 3వ పేజీలో..

## 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మాజీ మావోయిస్టు నేత

- ఇంటర్ పరీక్ష రాయనున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ

3

# ట్యాపింగ్ కేసులో కీలక మలుపు?




**మొదటిపేజీ తరువాయి**

సాగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును సీపీ సజ్జనార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్

ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు తదితర అధికారులను ఇప్పటికే అరెస్ట్ చేసి విచారణ జరిపిన సిట్.. వారి వాంగ్మూలాల ఆధారంగా కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. అధికారుల విచారణలో బయటపడిన అంశాల ఆధారంగా రాజకీయ నాయకుల పాత్రపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

**అగ్రనేత కుటుంబంపై చర్చ**

ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన అగ్రనేతతో పాటు ఆయన కుటుంబానికి చెందిన ఇద్దరి పేర్లు కూడా ఉండే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరో తొమ్మిది మంది బీఆర్ఎస్ కీలక నేతల పేర్లు కూడా చేర్చనున్నట్టు లీకులు వెలువడుతున్నాయి. అయితే అధికారికంగా మాత్రం సిట్ ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ చేయలేదు.

మొత్తం 1300 ఫోన్లను ట్యాప్ చేసినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించినట్టు సమాచారం. అప్పటి ప్రతిపక్ష నాయకులతో పాటు సొంత పార్టీ నేతలు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లు కూడా నిఘాలో ఉన్నాయన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వ్యక్తిగత సమాచార సేకరణ, రాజకీయ అవసరాల కోసం నిఘా నిర్వహించారన్న కోణంలో సిట్ విచారణ సాగించినట్టు తెలుస్తోంది.

**టెక్నికల్ ఆధారాలే కీలకం**

ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక టెక్నికల్ డేటాను తొలగించినప్పటికీ.. దానిని రికవరీ చేయడంలో దర్యాప్తు బృందం విజయవంతమైందన్న సమాచారం వెలువడుతోంది. కాల్ డేటా, సర్వర్ వివరాలు, నిఘా వ్యవస్థ వినియోగానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలను ఛార్జ్‌షీట్‌లో పొందుపరుస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఆధారాలే కేసులో కీలకంగా మారే అవకాశముందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న సమయంలో ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరగడం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో ఎవరి పేర్లు ఉంటాయి? కేసు కోర్టులో ఎంతవరకు నిలుస్తుంది? అన్న అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.



# హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

**మొదటిపేజీ తరువాయి**

ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లో నివాసంలోని ఆయన నివాసంలో భేటీ అయింది. ఈ సందర్భంగా దారా ఖోస్రోషాహి..

ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

కాగా, దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు.ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.







## బండి సంజయ్ కుమారుడిపై

# లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

**తెలంగాణ బ్యూరో, మే 13 :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై గంభీరమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన ప్రధానితో వేదిక పంచుకోవటం శోచనీయమని అన్నారు. కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు బండి సంజయ్ ఆ మీటింగ్ కు వెళ్లాల్సింది కాదన్నారు. బడాబాబుల పిల్లలు ఏం చేసిన సరే పోలీసులు చర్యలు తీసుకోరన్న అభిప్రాయం ప్రధాని సభతో ప్రజల్లోకి వెళ్లిందన్నారు. నిందితులను దేశం దాటించే అలవాటు బీజేపీకి ఉందని గుర్తు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో అది నిరూపితమైందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటిపోకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

కొందరు ట్వీట్స్ చేస్తూ సమస్యను పరిష్కరించినట్లు బిల్డప్ ఇస్తున్నారని.. అలాంటి పార్టీ వాళ్లు తానేందుకు స్పందించలేదని అడ్డగోలుగా కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఆడపిల్ల విషయం, అందులోనూ మైనర్ విషయంలో స్పందించే ముందు సంయమనం పాటించాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమించినట్లుగా ఆడపిల్లలను క్షమించదని చెప్పారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధిత అమ్మాయి ఫోటోలు బయటకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫోటోలు బయటకు వస్తే వాళ్ల జీవితం నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఫోటోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా ఎకౌంట్లను గుర్తించి వాళ్లను అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాజకీయాల్లోని లేని బండి సంజయ్ కుమారుడి విషయంలో రాజకీయాలను చేయటం తనకు ఇష్టం లేదని బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తన అభిమతమన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు మరోసారి మొండి చెయ్యి చూపించారని చేశారు. తెలంగాణ పర్యటనలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇస్తారని భావించిన మనకు పొదుపు సూత్రాలు చెప్పి... ఆంధ్రాకు పైసలు ఇచ్చి వెళ్లిపోయారని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్ట్ జాతీయ హోదా విషయంలో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జాతీయ హోదా గురించి ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని కవిత ప్రశ్నించారు. ప్రధాని పర్యటనలో తెలంగాణకు ఏం ఇవ్వకపోయినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

**తెలంగాణపై మళ్లీ అదే వివక్ష**

తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ మరోసారి రాష్ట్రం పై వివక్ష చూపారని కవిత అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా సహా మహిళ బిల్లు, జనగణనలో కుల గణన గురించి మాట్లాడతారని భావించినప్పటికీ వాటి గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు.పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనిపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అదే విధంగా బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లులకు ఆమోదం తెలుపాలని మరోసారి డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన కాలంతో పాటు సబ్ క్యాస్ట్, ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసుకునేలా వివరాలు పొందుపర్చాలని కేంద్రాన్ని కవిత కోరారు. మహిళ బిల్లులో ఓబీసీ మహిళల సబ్ కోటా ఉండాల్సిందేన్నారు.

**మీ గురువును చూసి నేర్చుకో**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కవిత మండిపడ్డారు. నీళ్ల విషయంలో మనకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా కోసం ప్రధాని మోడీకి లేఖ రాయాలని రేవంత్ ను కోరారు. ఒక వైపు పోలవరం పూర్తి చేసేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే...రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరు ప్రాజెక్ట్ ను ఎందుకు పట్టించుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటి వరకు కూడా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో ఒక్క రివ్యూ కూడా చేయలేదని కవిత విమర్శించారు. మాట్లాడితే నల్లమల్ల బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు రంగారెడ్డి విషయంలో చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న మీ గురువు చంద్రబాబు నాయుడిని చూసైన నేర్చుకో అంటూ రేవంత్ కు సూచించారు. పాలమూరు రంగారెడ్డి లాంటి పరిస్థితే ఉన్న అప్పర్ భద్రకు కూడా జాతీయ హోదా ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కేంద్రం పై ఒత్తిడి పెంచి జాతీయ హోదా వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చిన సందర్భంలో జాతీయ హోదా గురించి బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

**సాగు యోగ్యమయ్యే ప్రతి గుంట భూమికి నీళ్లిస్తాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల కోసమని కవిత చెప్పారు. కానీ ఇప్పటికి కూడా మనం గోదావరి లో మన వాటాలో పావు శాతం, కృష్ణాలో అరశాతం కూడా వాడుకోవటం లేదని చెప్పారు. ఆంధ్రాలో మాత్రం వాళ్ల వాటాకు మించి నీళ్లు వాడుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. వారితో పోల్చుకుంటే మనం ఎంతో వెనుకబడి ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు కాగా ఇప్పుడు కాంగ్రెస్ కూడా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తుందని కానీ నీళ్లు మాత్రం వాడుకునే సిస్టమ్ చేయలేకపోయారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణ లో సాగు యోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు ఇస్తామని కవిత చెప్పారు. ఇందుకోసం వాటర్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక లష్కర్ ను నియమిస్తామని చెప్పారు. తెలంగాణలో ఉన్న అన్ని నదులపై వందేళ్లు పటిష్టంగా ఉండేలా గేట్లతో కూడిన చెక్ డ్యామ్ లు కడుతామన్నారు.

**జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది**

ఈ నెల 20 నుంచి చేపట్టబోయే జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది అని కవిత అన్నారు. పలు నియోజకవర్గాల్లో జెండా పండుగకు తాను హాజరవుతానని చెప్పారు. జెండా పండుగ నిర్వహణ ఆధారంగా పదవులు ఇస్తామని చెప్పారు. బీసీలకు చట్టసభలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం కొట్లాడుతామని చెప్పారు. అన్ని రాష్ట్రాలు తిరిగి ఈ అంశంపై తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఇక నీట్ పేపర్ లీక్ అయి పరీక్ష రద్దు చేయటంపై కవిత మండిపడ్డారు. రూ. పది డైపర్ కూడా లీక్ కావటం లేదని, అలాంటి నీట్ పేపర్ ఎలా లీక్ అవుతుందని ప్రశ్నించారు. దేశ భవిష్యత్ అయిన విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా కేంద్రం చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఇంత టెక్నాలజీ వచ్చిన తర్వాత కూడా పేపర్ లీక్ కాకుండా చర్యలు తీసుకోలేరా అని ప్రశ్నించారు.

**రైల్వే కోర్టుకు హాజరైన కవిత...**

నాంపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో రైల్ రోకో చేసిన కేసులో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్ లో గల సికింద్రాబాద్ సెకండ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేయడంతో వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ జూలై 17న నిర్వహిస్తామని మేజిస్ట్రేట్ ప్రకటించారు.

బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 2025 నవంబర్ 28న కామారెడ్డిలో టీఆర్ఎస్ నాయకులు రైల్ రోకో చేశారు. ఈ ఆందోళనపై రైల్వే పోలీసులు కల్వకుంట్ల కవితతో పాటు 12 మందిపై కేసు నమోదు చేశారు. మనోరంజన్ రైల్వే కోర్టు విచారణ అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కేసులకు, విచారణలకు భయపడేది లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అవసరమైతే నిరవధిక రైల్ రోకో చేసేందుకు కూడా సిద్ధమని తేల్చిచెప్పారు.

# మెగా గ్రోత్ కారిడార్‌తో తెలంగాణకు కొత్త దిశ

- **వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌కు ఔటర్ రింగ్ రోడ్ల ప్రతిపాదన**
- **ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి అనుసంధానంగా మౌలిక వసతుల రూపకల్పన**
- **ఈవీ వాహనాలు, పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి**
- **టూరిజం, టెంపుల్ కారిడార్ల ఏర్పాటుకు ప్రణాళికలు**
- **వచ్చే 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా నగరాభివృద్ధి**



**హైదరాబాద్, మే13 :**

రాష్ట్ర భవిష్యత్ పట్టణాభివృద్ధికి కీలకంగా భావిస్తున్న మెగా గ్రోత్ కారిడార్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాలను కేంద్రంగా చేసుకుని సమగ్ర మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎయిర్‌పోర్టులను దృష్టిలో ఉంచుకుని రహదారులు, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలు, ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

సమావేశంలో సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. నగరాల విస్తరణను ముందుగానే అంచనా వేసి వచ్చే 25 ఏళ్ల అవసరాలకు సరిపోయేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ సాంకేతికత వినియోగంపై నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లీజ్‌కు తీసుకునే వాహనాలు సహా ప్రభుత్వ వినియోగంలో ఈవీ వాహనాలే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణాల్లో రేడియేషన్ ప్రభావం తగ్గించేందుకు మల్టీ యుటిలిటీ టవర్లు, స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

టూరిజం, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికీ మెగా కారిడార్ ప్రణాళికలను అనుసంధానించాలని సీఎం పేర్కొన్నారు. నల్గొండ-యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్-నాగోబా-బాసర-కడెం ప్రాంతాలను కలుపుతూ టూరిజం కారిడార్ అభివృద్ధి చేయాలని తెలిపారు. అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధిని కృష్ణా పుష్కరాలకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్తగూడం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను సమగ్ర కారిడార్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలపైనా చర్చ జరిగింది.

వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కారిడార్‌లు భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి కీలకమని సీఎం పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుల రాకతో ఆయా ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయని, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ డిఫెన్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి కానుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన పట్టణాభివృద్ధి విధానంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

# 15న విచారణకు హాజరవుతా

**మొదటిపేజీ తరువాయి**

సమర్పిస్తానని భగీరథ్ వెల్లడించారు. దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సిట్ అధికారుల దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని బండి భగీరథ్ స్పష్టం చేశారు. కేసు విచారణలో పారదర్శకంగా వ్యవహరిస్తానని లేఖలో పేర్కొన్నారు.

# పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

**హైదరాబాద్, మే 13:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై పోక్సో కేసు నమోదు అయిన విషయం విదితమే. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసు జారీ చేశారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్ పోలీసుల విచారణకు హాజరు కాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (తి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ గురువారం విచారణ జరపనుంది.

**భగీరథ్ అబ్‌స్కాండింగ్..**
**నగరంలో పలుచోట్ల పోస్టర్లు**

పోక్సో కేసు నమోదైన భగీరథ్‌పై అబ్‌స్కాండింగ్ అంటూ నగరంలో పలుచోట్ల పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని ఉంది. కొన్నిరోజులుగా భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల

# గొంతు కోస్తున్నారు

**ఖమ్మం, మే13 :**

"డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా?" అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన నీట్ పరీక్ష పత్రాల లీకేజీ అంశంపై మాట్లాడారు.

పరీక్షకు 42 గంటల ముందే నీట్ ప్రశ్న పత్రాలు బయటకు రావడం దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ కుంభకోణంతో దేశవ్యాప్తంగా 23 లక్షల మంది, తెలంగాణలో 70 వేల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వ్యవహారంపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ గ్రూప్1 నుంచి గ్రూప్4 వరకు పలు పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వానికి చెందిన వ్యక్తులే ప్రశ్నపత్రాల విక్రయంలో భాగమయ్యారని ఆరోపించారు. ఇంటర్ ఫలితాల తారుమారుతో 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామక సంస్థలను ప్రక్షాళన చేసి పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.ప్రజా దర్బార్ కార్యక్రమంలో జీళ్లచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల ప్రజల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా

# మాజీ మావోయిస్టు నేత

- **ఇంటర్ పరీక్ష రాయనున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ**
- **ఇంటర్ పూర్తి కోసం సప్లిమెంటరీ పరీక్షకు హాజరు**
- **లా చదవాలనే లక్ష్యంతో మళ్లీ పుస్తకాలు పట్టిన మాజీ నేత**
- **ఒక్క తెలుగు పరీక్ష మిగిలిపోవడంతో ప్రత్యేక అనుమతి**
- **గతేడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ**
- **అజ్ఞాతం నుంచి సాధారణ జీవితంలోకి అడుగులు**

**కోరుట్ల, మే 13 :**

మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నలభై రెండేళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్ పరీక్ష రాయడానికి సిద్ధమవుతున్నారు. కోరుట్లలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న ఆయన, ఒకప్పుడు మధ్యలో ఆగిపోయిన విద్యను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. లా కోర్సులో చేరాలనే లక్ష్యంతో ఇంటర్ పూర్తి చేయాల్సి రావడంతో ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు.

తిప్పిరి తిరుపతి కోరుట్లలో ఇంటర్ చదువుతున్న సమయంలోనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పట్లో నమోదైన కేసులు, పోలీసు పరిస్థితుల కారణంగా తెలుగు పరీక్షకు హాజరుకాలేకపోయారు. మిగతా అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినప్పటికీ, ఒకే ఒక్క తెలుగు పరీక్ష మిగిలిపోయింది. ప్రస్తుతం ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు అవకాశం లభించింది.

గతేడాది నవంబర్‌లో తిప్పిరి తిరుపతి ముగ్గురు సహచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయన లొంగుబాటును అప్పటి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. మావోయిస్టు కార్యకలాపాల నుంచి బయటకు వచ్చి సాధారణ జీవితం వైపు అడుగులు వేయడం శాంతి ప్రక్రియకు సానుకూల సంకేతమని అప్పట్లో ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించిన దేవ్‌జీ, బసవరాజు మరణం తర్వాత సంస్థలో అగ్రస్థాన నాయకత్వంలో ఉన్న వ్యక్తిగా భావించబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో ఆయన లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు విద్యను కొనసాగిస్తూ న్యాయవాద వృత్తి వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకోవడం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది.



# నగరాన్ని వణికిస్తున్న నేపాలీ గ్యాంగ్!

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నతాధికారి భార్యను అతి దారుణంగా హత్య చేసి నేపాలీ ముఠా పరారవ్వగా, నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మరో ఘటనలో సోమవారం నాడు ఒక వృద్ధ దంపతులను ఇంట్లోనే కట్టేసి, బీభత్సం సృష్టించి, ఉన్నదంతా దోచుకుని పారిపోయారు. ఈ వరుస ఘటనలు నేపాలీ పనిమనుషుల పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళనను, భయాన్ని కలిగిస్తున్నాయి.

**తక్కువ జీతమే శాపమా..?**

హైదరాబాద్‌లో ప్రస్తుతం పనిమనుషుల కొరత విపరీతంగా ఉండటం నేరగాళ్లకు వరంగా మారింది. ఇదే అదనుగా నేపాలీలు తక్కువ జీతానికే వాచ్‌మెన్లుగా, వంట మనుషులుగా చేరుతున్నారు. యజమానులు కూడా తక్కువ ఖర్చుతో పని అయిపోతుందని ఆశపడి, వారి వివరాలు సరిగా సేకరించకుండానే ఇంట్లోకి చేర్చుకుంటున్నారు. గత రెండేళ్లలో నగరంలో నేపాలీల సంఖ్య విపరీతంగా పెరగడం, వారిపై సరైన నిఘా లేకపోవడం ఈ నేరాలకు ప్రధాన కారణమవుతోంది. స్థానిక కూలీల కంటే తక్కువ జీతానికే దొరుకుతుండటంతో వీరికి డిమాండ్ పెరిగింది, కానీ అదే ఇప్పుడు యజమానుల ప్రాణాల మీదకు తెస్తోంది.

**రెక్కీ నిర్వహించి మరీ దోపిడీ**

దోపిడీ లక్ష్యంగా వచ్చే నేపాలీలు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వీరు నేరుగా దొంగతనానికి రాకుండా, మొదట కూలీలుగా లేదా పనిమనుషులుగా నిశ్శబ్దంగా ఇళ్లలోకి ప్రవేశిస్తారు. ఇంట్లో ఎవరెవరు ఉంటారు? నగదు, నగలు ఎక్కడ భద్రపరుస్తారు? సీసీ కెమెరాలు ఎక్కడ ఉన్నాయి? వంటి అంశాలపై పూర్తిగా 'రెక్కీ' నిర్వహిస్తారు. ముఖ్యంగా పిల్లలు విదేశాల్లో ఉండి, ఇంట్లో ఒంటరిగా ఉండే వృద్ధ దంపతులనే వీరు ప్రధానంగా పసిగడతారు. ఒకరు పనిలో చేరి లోగుట్టు తెలుసుకున్న తర్వాత, మిగిలిన ముఠా సభ్యులను పిలిపించి పక్కా స్కెచ్‌తో దోపిడీలకు పాల్పడుతున్నారు.

**నిఘా లేని వలసలు**

నగరంలో కేవలం నేపాలీలే కాకుండా బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల వారు కూడా అక్రమంగా చేరుతూ ఉపాధి పొందుతున్నారు. తక్కువ జీతం ఇస్తున్నామన్న నెపంతో యజమానులు వీరి వివరాలను పోలీసులకు తెలపకుండా గోప్యంగా ఉంచుతున్నారు. ఎప్పుడైతే ఇలాంటి హత్యలు లేదా దోపిడీలు జరుగుతాయో, అప్పుడు మాత్రమే అధికారులు విచారణ చేపడుతున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే పరిస్థితి మళ్లీ మామూలుగా మారిపోతోంది. విదేశీయులు లేదా పొరుగు దేశాల నుంచి వచ్చే వలసదారులపై నిరంతర నిఘా లేకపోవడం నేరగాళ్లకు పెద్ద వెసులుబాటుగా మారింది.

**వర్కర్ అగ్రిమెంట్ తప్పనిసరి**

నగరంలో నివసించే వారు తమ భద్రత కోసం కొన్ని నియమాలను కచ్చితంగా పాటించాలని పోలీస్ శాఖ పదేపదే హెచ్చరిస్తోంది. అద్దెకు ఉండేవారి కోసం రెంటల్ అగ్రిమెంట్ ఎలాగైతే చేస్తారో, అలాగే పని మనుషుల వివరాలు పోలీసులకు ఇచ్చేలా 'వర్కర్ అగ్రిమెంట్' ఉండాలి. తమ వద్ద పనిచేసే వారి వివరాలను, ఫొటోలను, ఆధార్ కార్డులను సమీప పోలీసు స్టేషన్‌లో సమర్పించి వెరిఫికేషన్ చేయించుకోవాలి. పనిమనిషిని పెట్టుకునే ముందే వారి నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం వల్ల ఇటువంటి ముప్పుల నుండి తప్పించుకోవచ్చు.

**అప్రమత్తతే రక్షణ**

ప్రస్తుతం హైదరాబాద్ వ్యాప్తంగా వేలాదిగా నేపాలీలు విస్తరించి ఉన్నారు. వీరిలో నిజాయితీగా కష్టపడే వారెవరో, దోపిడీ లక్ష్యంతో వచ్చిన నేరగాళ్లెవరో గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. యజమానులు కేవలం తక్కువ జీతానికి వస్తున్నారని ఆశపడి అపరిచితులను ఇంట్లోకి చేర్చుకోవడం వల్ల నిలువునా మునిగిపోయే ప్రమాదం ఉంది. అప్రమత్తతే రక్షణ అని, ప్రతి యజమాని తమ పనిమనుషుల వివరాలను పోలీసులకు తెలిపి నిఘా ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# కఠిన చర్యలు తీసుకుంటాం

- **డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు**
- **బక్రీద్ సందర్భంగా పోలీసు అధికారులతో వీసీ**



**హైదరాబాద్, మే 13 :**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రెటరీ కె.ఇలంబరి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బక్రీద్.. ఇతర పండగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్‌పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండగ ముగిసే వరకు తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు సస్పెక్ట్ షీట్లు కూడా తెరుస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండు వర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు బక్రీద్ పండగ అప్రమత్తతో ఉన్నారని తెలిరు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్టు యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇలంబర్తి మాట్లాడుతూ పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు పలు సూచనలు చేశారు.

# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

**మహబూబాబాద్, మే 13:**

భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు.ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ 'మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు రండి

**మొదటిపేజీ తరువాయి**

కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం అందింది. బుధవారం దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు..ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ అధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం,రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



# బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **ఆ కేసులో ఎలాంటి జాప్యం లేదు**
- **చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవు**
- **బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం**
- **కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి**
- **ఎస్ ఐ ఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోంది**

**తెలంగాణ బ్యూరో, మే13:**

మైనర్ బాలికపై లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటోన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు ఏ మాత్రం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఆయన మీడియాతో
చిట్ చాట్ చేశారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని చెప్పారు. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులు తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అన్నారు. బండి భగీరథ్



కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాము నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎస్ ఐ ఆర్ తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.



సంపాదకీయం

# ఎన్‌టీఏ వైఫల్యం విద్యార్థులకు శాపం!


కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్‌లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేందప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చున్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# చమురు సంక్షోభం.. పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన మోడీ
- రెండు కార్లతో ఢిల్లీ వీధుల్లో ప్రధాని పయనం
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- రాష్ట్రాల సీఎంల కాన్వాయ్‌ల కుదింపు



**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ముడి చమురు ధరలపై తీవ్రంగా పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, దేశీయంగా ఇంధన వినియోగాన్ని తగ్గించి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేవలం పిలుపునివ్వడమే కాకుండా, స్వయంగా తన నుండే ఈ మార్పును ప్రారంభిస్తూ ప్రధాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన భద్రత కోసం వినియోగించే కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఏకంగా 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని ఎస్‌పీజీని ఆదేశించారు. భద్రతా ప్రోటోకాల్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండానే, ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రధాని ఆదేశాలతో ఎస్పీజీ ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణను ప్రారంభించింది. చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో



భాగంగా విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని ప్రధాని నిర్ణయించారు. అయితే, ఇందుకోసం కొత్త కార్లను కొనుగోలు చేయవద్దని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వాహనాలనే గరిష్ఠంగా వినియోగించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడకుండా ఆయన తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశమైంది.

## రెండు కార్లతో మోడీ పయనం

ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్‌లో 50శాతం వాహనాలను తగ్గించాలని ఆదేశించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్‌తో ప్రయాణం చేస్తున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపించడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ వీధుల్లో ప్రధాని కాన్వాయ్ దృష్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

## అమిత్ షా సహా పలువురు సీఎంల బాట

ప్రధాని బాటలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లోని వాహనాలను సగానికి తగ్గించుకున్నారు. కేంద్ర మంత్రులతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు కూడా తమ కాన్వాయ్‌లను కుదించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖలు సైతం ఇంధన పొదుపుపై సమీక్షలు జరుపుతున్నాయి. ముడి చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ప్రస్తుత సంక్షోభం సవాలుగా మారిన తరుణంలో, అగ్రనేతలు తీసుకుంటున్న ఈ పొదుపు చర్యలు సామాన్య ప్రజలకు కూడా ఒక సంకేతాన్ని పంపిస్తున్నాయి. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు.

# బంగారం, వెండి ప్రియులకు షాక్

## కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి పెంపు!

## రూపాయి పతనం, చమురు సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయం


**న్యూఢిల్లీ, మే 13:** దేశంలో పసిడి, వెండి ధరలకు మరింత రెక్కలు రానున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 6 శాతంగా ఉన్న మొత్తం దిగుమతి సుంకాన్ని ఏకంగా 15 శాతానికి పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 10 శాతానికి చేరుకోగా, దీనికి అదనంగా 5 శాతం అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను జోడించారు. వెరసి, మొత్తం దిగుమతి సుంకం 15 శాతానికి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో □95.75కి పడిపోవడంతో ప్రభుత్వం ఈ అప్రమత్తత చర్యలు చేపట్టింది. ప్రపంచంలో బంగారం వినియోగంలో భారత్ రెండో స్థానంలో ఉండగా, వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం మనం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. గతేడాది ఈక్విటీ మార్కెట్లలో రాబడులు తగ్గడంతో, పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు గతేడాది కంటే 186 శాతం పెరిగాయి. ఇప్పటికే బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల్లో ఉండగా, తాజా సుంకాల పెంపుతో డిమాండ్ మరింత తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. గతంలో ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించినప్పుడు బ్యాంకులు నెల రోజుల పాటు దిగుమతులను నిలిపివేయడంతో, ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయాయి. చమురు సంక్షోభం మరియు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రజలు పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన మరుసటి రోజే ఈ నిర్ణయం రావడం గమనార్హం.



# బలపరీక్షలో నెగ్గిన టీవీకే ప్రభుత్వం!

## ఓటింగ్‌ను బహిష్కరించిన డీఎంకే..

## మద్దతుగా అన్నాడీఎంకే రెబల్ వర్గం



**చెన్నై, మే 13:** తమిళనాడు సీఎం విజయ్ తన రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయిని అధిగమించారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఆయన తన బలాన్ని నిరూపించుకుని ప్రభుత్వంపై ఉన్న నీలినీడలను తొలగించారు. మొత్తం 234 స్థానాలున్న అసెంబ్లీలో జరిగిన ఈ బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి మద్దతుగా ఓటు వేయగా, 22 మంది వ్యతిరేకించారు. టీవీకే పార్టీకి సొంతంగా 108 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలిచారు. అత్యంత ఆసక్తికరంగా, అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబల్ ఎమ్మెల్యేలు సైతం విప్‌ను ధిక్కరించి విజయ్‌కు అనుకూలంగా ఓటు వేశారు. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే ఈ ఓటింగ్‌ను బహిష్కరిస్తూ సభ నుండి వాకౌట్ చేసింది. డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభలో లేకపోవడంతో మ్యాజిక్ మార్కు తగ్గింది, ఇది విజయ్ గెలుపును మరింత సులభతరం చేసింది. బలపరీక్షలో నెగ్గిన అనంతరం సీఎం విజయ్ సభలో ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "ప్రజలను నమ్ముకునే మేము ఎన్నికల బరిలోకి దిగామని, అన్ని వర్గాల మద్దతుతో ఐదేళ్ల పాటు సుస్థిర పాలన అందిస్తామని" ఆయన ధీమా వ్యక్తం చేశారు. లౌకిక విధానాన్ని పాటిస్తూ, మహిళల భద్రత మరియు సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన పునరుద్ఘాటించారు. విమర్శలు ఎదుర్కొన్న ఓఎస్డీ రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని సానుకూల నిర్ణయం తీసుకున్నారు. విశ్వాస పరీక్ష సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. ఇది 'రీల్ ప్రభుత్వం' అని, ఎమ్మెల్యేల కొనుగోళ్లతోనే విజయ్ గట్టెక్కారని ఆరోపించారు. అన్నాడీఎంకే అధినేత పళనిసామి కూడా తమ ఎమ్మెల్యేలకు విజయ్ డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించగా, రెబల్ వర్గం నేత వేలుమణి ఆ ఆరోపణలను తిప్పికొట్టారు. తాము ఎలాంటి పదవులను ఆశించి మద్దతు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.




# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

## పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ, మే 13:** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ–చికాగో, ముంబై–న్యూయార్క్, ఢిల్లీ–షాంఘై, చెన్నై–సింగపూర్, ముంబై–ఢాకా, ఢిల్లీ–మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది. నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఆచార్ల గూడెంలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవాలు

- 16వ రోజు పండుగలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- స్వామి అనుగ్రహంతో ప్రజలంతా చల్లగా ఉండాలి" అని ఆకాంక్ష



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలం ఆచార్ల గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ 16వ రోజు పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూర్ణకుంభ స్వాగతం: ఆలయానికి విచ్చేసిన మంత్రి పొంగులేటికి వేద పండితులు పంతంగి యశస్కర్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, అన్నదానం:ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రేగూరి వాసవి హనుమంతరావు దంపతులు మంత్రి కి స్వామివారి కానుకగా పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.శ్రీ సీతారామచంద్ర స్వామివారి అనుగ్రహంతో ఆచార్ల గూడెం గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలి" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించారు.

**భారీగా భక్తులు:**
గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. 16 రోజులుగా జరుగుతున్న ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలకపొంగు ఉప్పలమ్మ సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూస సీతారాములు, శాఖమూరి రమేష్, మండల పార్టీ అధ్యక్షులు కొడాలి గోవిందరావు, నెల్లూరు భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జగ్రిపోతుల అంజనీ, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, మాజీ ఎంపీపీ చిర్రా లక్ష్మి, మాజీ సర్పంచులు రేగూరి శ్రావణ్ కుమార్, పులిమి నిర్మల, మాగం సైదులు, లిక్కి మల్లేశం, మారుతి రామయ్య, పులి వీరారెడ్డి, చిట్టా సైదిరెడ్డి, మారుతి నాగేశ్వరావు, నాగరాజు, ఉపేందర్, మండల, గ్రామ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేలకొండపల్లి హైస్కూల్లో విద్యా వారోత్సవాలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి, విద్యా వారోత్సవాల సందర్భంగా నేలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎర్రయ్య, ఎంఈఓ చలపతిరావు, హెచ్ఎం రమేష్ పాల్గొని ప్రసంగించారు.ఎంపీడీవో ఎర్రయ్య మాట్లాడుతూ"బడి బాగుంటేనే ఊరు బాగుంటుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత సర్పంచులపైనే ఉంది. మన ఊరి బడిలో మన పిల్లలే చదివేలా ప్రోత్సహించాలి. మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందేలా గ్రామ పంచాయతీలు సహకరించాలి" అని పిలుపునిచ్చారు. ఎంఈఓ చలపతిరావు విద్యా వారోత్సవాల ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ "డ్రాపౌట్స్ లేకుండా 100% విద్యార్థుల నమోదు, హాజరు, నాణ్యమైన బోధన కోసం అందరం కలిసి పనిచేయాలి. అంగన్‌వాడీ నుంచి పదవ తరగతి వరకు ప్రతి విద్యార్థి భవితకు బాట వేయాలి" అని అన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న మండలంలోని పలు గ్రామాల సర్పంచులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్, అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గిద్ద-2 గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శిబచి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వచ్చే 4 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ సురేందర్, డి ఎం శ్రీకాంత్, ప్రత్యేక అధికారులు, తాసిల్దార్ సుమలత, ఎంపీడీవో నాగేశ్వర్, ఆర్ ఐ రవికాంత్, ఎంఈఓ ఆనంద్ రావు, ఏవో భాను శ్రీ,, ఏఈఓ రాకేష్, గ్రామ సర్పంచ్ సవిత, ఐకెపి ఏపిఎం పద్మావతి, సీసీ రాజు,సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష రద్దు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం ఆటలాడుతోంది అని కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద నీట్ పరీక్షల రద్దు, ప్రశ్నా పత్రాల లీకేజీ ఘటనలపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ ఖలీద్ అహ్మద్, భవ్య, రోహిణి సూచనల మేరకు మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే చివరికి పరీక్షలను రద్దు చేయడం వారి భవిష్యత్తుతో ఆటలాడటమేనని మండిపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందని, దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలను అనిశ్చితిలోకి నెట్టిందని విమర్శించారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వ విధానాలను యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ నాయుడు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బి వినయ్, సుదీర్, వికాస్, అబ్బాస్, శ్రీకాంత్, అఖిల్, నరేష్, శివ, లక్ష్మణ్ ,మహేష్, రఫీ, డి శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్కల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం

**నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, యువజన నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి**



**నాగారం, రాజముద్ర న్యూస్:** నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,యువజన నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో నాగారం, రాంపల్లి చెరువులలో దీర్ఘకాలంగా పేరుకుపోతున్న గుర్రపు డెక్కల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దిశగా అడుగులు వేసింది. బుధవారం నాగారం, రాంపల్లి చెరువు లో ఉన్న గుర్రపు డెక్కల వలన ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు గుర్రపు డెక్క ను తక్షణమే తొలగించి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ రెండు నెలల క్రితం ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఒక వినతిపత్రం సమర్పించబడింది. ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి, టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, శుభ్రపరిచే పనులు మొదలయ్యేలా పనులను ప్రారంభించడం జరుగుతుంది. రాంపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ముప్పు శ్రీనివాస్ రెడ్డి,జీవన్ రెడ్డి స్వయంగా తనిఖీ చేసి పర్యవేక్షించారు. ఇలాగే పనులు పూర్తయ్యే వరకు నిరంతరంగా రోజువారీ పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంగ సంతోష్,అన్ని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మజేటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?

- మంత్రి పొంగులేటి
- నీట్' కుంభకోణమే కేంద్రం అసమర్థతకు నిదర్శనం
- జీళ్లచెరువు ప్రజా దర్బార్‌లో కేంద్రం, గత బీఆర్ఎస్ సర్కార్‌పై నిప్పులు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కూసుమంచి, డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడం కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా?" అని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

**కేంద్రానిది కళ్లుండి చూడలేని తనం:**
నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై మంత్రి పొంగులేటి మండిపడ్డారు. "పరీక్షకు 42 గంటల ముందే పేపర్లు బయటకు రావడం దారుణం. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది, మన రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణం వల్ల రోడ్డున పడ్డారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఏమీ ఎరుగనట్లు నాటకమాడుతోందని విమర్శించారు. "ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలి" అని డిమాండ్ చేశారు.

**నాడు దొరల పాలనలోనూ అదే తీరు:**
తెలంగాణలో గత పదేళ్ల 'దొరల పాలన'లో జరిగిన అన్యాయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు అన్ని పేపర్లూ లీక్ అయ్యాయి. ఆనాటి మంత్రుల పీఏలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారు" అని సంచలన ఆరోపణలు చేశారు. "ఇంటర్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోంది" అని విమర్శించారు.

**మేము 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం:**
మేము అధికారంలోకి రాగానే నియామక సంస్థలను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. పేపర్ లీకేజీలకు చెక్ పెట్టాం" అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ:**
జీళ్లచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. "న్యాయమైన ప్రతి సమస్యను 100 శాతం పరిష్కరిస్తాం" అని ప్రజలకు భరోసా ఇచ్చారు.

## నాణ్యమైన ధాన్యం సత్వరమే కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- పాలేరు ఐకెపి కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దు
- ధాన్యం రవాణాకు వాహనాలను సిద్ధం చేయాలి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కొనుగోలు కేంద్రానికి వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన మద్దతు ధరపై కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.పాలేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి కోనుగోలు ప్రక్రియ, కేంద్రాల్లో రైతులకు అందిస్తోన్న మౌళిక వసతులను ఆయన పరిశీలించి,పలు సూచనలు చేశారు.టోకెన్ విధానం అమలులో ఉందా అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని, టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేస్తున్నారా, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కట్టుదిట్టంగా నిర్వహించాలని, ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వివరాలు, వారు తీసుకువచ్చిన వడ్ల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి,వడ్ల తేమశాతం ఎప్పటికప్పుడు రికార్డ్ చేసి కొనుగోలు చేయాలని అన్నారు.మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల దృష్ట్యా పంట నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి**
ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.కొనుగోలు చేసిన వడ్ల వివరాలను వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బుల చెల్లింపులు జరిగేలా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు మొదలైన మౌళిక వసతుల ఏర్పాటు పకడ్బందీగా ఉండాలన్నారు.వేసవి కాలం దృష్ట్యా త్రాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్ లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఇచ్చార్జ్ మేనేజర్ సునీల్ రెడ్డి,డిఆర్డీవో శ్రీరాం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్,తహసీల్దారు సైదులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భార్యను వేదించిన భర్తకు సంవత్సరంనర కాలం జైలు శిక్ష రూ. 7000 జరిమానా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** భార్యను వేదించిన భర్తకు సంవత్సరంనర కాలం పాటు జైలు శిక్ష, రూ. 7000 జరిమానా విదిస్తూ వికారాబాద్ జుడీష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శాంతిలత తీర్పు వెల్లడించినారని మహిళా పోలీసు స్టేషన్ సిఐ ఎం. వెంకటరాం నాయక్ తెలిపినారు. వివరాలలోకి వెళితే తేదీ 31.10.2020 రోజున గౌవిందాపూర్ గ్రామం, మోమిన్పేట మండలం, వికారాబాద్ జిల్లాకి చెందిన కంధడ సుజాత భర్త అనంతయ్య మహిళా పోలీసు స్టేషన్ వికారాబాద్ నందు ఫిర్యాదు చేసినది. 11.11.2013 రోజున కండద అనంతయ్య తండ్రి పరమయ్యాతో పెద్దల సమక్షంలో వివాహం జరిగిందని, వివానంతరం వారి సంసారం నాలుగు సంవస్తారాల వరకు బాగానే సాగిందని, ఆ తర్వాత నుండి తన భర్త తాగుటకు అలవాటుపడి ప్రతి రోజు తాగి వచ్చి అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నాడని పిర్యాడు చేయగా అప్పటి సిఐ బి. ప్రమీల కౌన్సెలింగ్ నిర్వహించిన పిదప కేసు ను నమోదు చేసి దర్యాపు నిమిత్తం SI బి. వీరన్నకి అప్పగించారు. విచారణ జరిపి నేరస్తుల మీద చార్జ్ షీట్ ను ఫైల్ చేసి వికారాబాద్ కోర్ట్ నందు సమర్పించగా వికారాబాద్ మెజిస్ట్రేట్ కేసు యొక్క పూర్వపరాలు పరిశీలించిన పిదప నేరస్తుడికి సంవత్సరంనర కాలం పాటు జైలు శిక్ష, రూ. 7000 జరిమానా విదిస్తూ తీర్పు వెల్లడించినారు. ఇట్టి కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా అన్వేష్ సింగ్ వ్యవహరించారు, నేరస్తునికి శిక్ష పడేవిధముగా పని చేసిన కోర్ట్ డ్యూటి ఆఫీసర్ ఈ.కృష్ణ హెడ్ కానిస్టేబుల్ లను ను మహిళా పోలీసు స్టేషన్ సిఐ ఎం. వెంకటరాం నాయక్ అబినంధించినారు.

## గణితంలో పిహెచ్డి సాధించిన మందడి సంజీవ రెడ్డి

**గోళ్లపాడు యువకుడికి అభినందనల వెల్లువ**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు గ్రామానికి చెందిన మందడి సంజీవరెడ్డి గణిత శాస్త్రంలో డాక్టరేట్(పిహెచ్డి)పట్టా సాధించారు. హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో డా.ఎం.అనిల్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధనలు నిర్వహించి హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఫినామినా ఇన్ ఎంహెచ్డి నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ స్ట్రెచింగ్, ష్రిన్కింగ్ షీట్స్ అనే అంశం పై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.విశ్వవిద్యాలయ నిపుణుల కమిటీ సూచనల మేరకు సంజీవరెడ్డిని డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్డి)పట్టాకు అర్హుడిగా ప్రకటించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు,అధ్యాపకులు ఆయనను అభినందించారు.పిహెచ్డి పట్టా సాధించడం పట్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ వెన్ను తట్టి ప్రోత్సహించిన తల్లిదండ్రులు,గురువులకి,పరిశోధన మార్గదర్శకుడు డా. ఎం.అనిల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో పరిశోధన,బోధన రంగాల్లో మరింత సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని తెలిపారు.

# ప్రభుత్వం చేపట్టే పథకాలు అమలు చేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కొడంగల్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నాణ్యమైన బోధన, మెరుగైన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. డిజిటల్ విద్య, విద్యార్థి సంక్షేమాన్ని అందరి భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పథకాలను అమలు చేసేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని ఆయన అన్నారు. కొడంగల్ నియోజక వర్గంలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి అధిక నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో నాణ్యమైన అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో అదనపు తరగతి, ప్రయోగశాల గదుల ఏర్పాటుతోపాటు టాయిలెట్ల నిర్మాణాలకు మంజూరు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల చొరవ ఎంతో అవసరమని దీనికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయని ముందు ముందు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలంటే అందరి సహకారం, కృషితో 100 శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో అధిక నిధులను కేటాయించి నాబార్డ్ అనుసంధానంతో పనులు చెప్పటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మరమ్మత్తు పనులు, త్రాగునీటి, విద్యుత్తు, టాయిలెట్ల సౌకర్యం కల్పించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సమీకృత గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని దీనికి సంబంధించి కొడంగల్ ప్రాంతంలో పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. త్వరలోనే హస్నాబాద్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలందరిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, ప్రజా ప్రతినిధులు పిల్లలను బడుల్లో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించి సహకరించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక పూర్వ పాఠశాలను ప్రారంభించి విద్యాబోధన కూడా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఏఐ సాంకేతికతో మ్యాథమెటిక్స్ నైపుణ్యత పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, నీటి ట్యాంకు, మురుగు కాలువల, స్మశాన వాటిక నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ సుధీర్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషాశ్రీ , మండల విద్యాధికారి రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆధునిక విద్య సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఆధునిక విద్యా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషి చేయాలనీ వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అన్నారు. బుధవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల కార్యక్రమం లో భాగంగా కలెక్టరేట్ సమావేశం హాలు నందు సర్పంచ్ లకు, కౌన్సిలర్ లకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా మున్సిపల్ చైర్మన్ గడ్డం అన్న్య జ్యోతి ప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల సందర్భంగా , వికారాబాద్ నియోజక వర్గం అయిదు మండలాలకు సంబంధించి సర్పంచులు , నియోజక వర్గ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో అయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే బాట అని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నాణ్య మైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలు , డిజిటల్ విద్యా, విద్యార్థి సంక్షేమం , సమాజ భాగస్వామ్యం ద్వార అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఇట్టి కార్యక్రమాలపై సర్పంచులు , కౌన్సిలర్లు అందరు అవగాహనా కలిపించుకొని ప్రతిరోజూ కొద్దిసేపు సమయం కేటాయించి మీ గ్రామంలో ఉండే పాఠశాలలను సందర్శించి, విద్యా, మౌళిక వసతులు, వాటిపై దృష్టి సారించాలని, బడి ఈడు పిల్లలు స్కూల్ కు వస్తున్నారా, ఉపాద్యాయులు వస్తున్నారా, అక్కడి సమస్యలను తెలుసుకోవాలని, విద్యార్థుల హాజరు శాతం రిజిస్టర్లు చెక్ చేయాలనీ, గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని , ప్రామాణికమైన బాద్యత మీపై ఉందని అన్నారు. ఎఫ్ ఎల్ ఏం, కే జి బివి, మధ్యాహ్నం భోజనం,బాల్య వివాహాలు , డిజిటల్, టి వి, ఫోన్లు, టెక్నికల్ వినియోగంపై అవగాహనా కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. విద్యార్థులు మానసికంగా శారీరకంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అల్పాహారం , మధ్యాహ్న భోజనం, అనేక వసతులు కల్పిస్తుందని అన్నారు. బాలికల విద్యనూ ప్రోత్సహిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు. అధికారులు మాట్లాడారు. విద్యా లక్ష్యం, పనిచేసే విధానం, విద్యలో స్థానిక సమస్తల పాత్ర, అమ్మ ఆదర్శ పాటశాల, మౌలిక వసతులు, ఎఫ్ ఎల్ ఎం, కే జి బి వి , బాలికల విద్యా మధ్యాహ్న భోజనం, బాల్య వివాహాలు డిజిటల్ వినియోగము పై ఉపాద్యాయులు పి పి టి ద్వార అవగాహనా కలిపించారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న నిక్షిప్త చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. ఈ సమావేశములో మునిసిపల్ వైస్ చైర్మెన్ అర్ధ సుధాకర్ రెడ్డి, విద్యా శాఖ అధికారి రేణుక దేవి, మండల విద్యాధికారులు, బంట్వారం , మర్పల్లి, ధరూర్, కోట్ పల్లి, వికారాబాద్ మండలాలకు సంబంధించిన సర్పంచులు, కౌన్సిలర్లు ,జిల్లా అధికారులు తదితరలు పాల్గొన్నారు.

# బోనకల్‌లో 'బిజినెస్ టీచర్' బాగోతం!

- బడి మానేసి థాయిలాండ్‌లో విలాసాలు.. అనుమతి లేకుండానే ఫారిన్ టూర్లు
- రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలతో రెండు చేతులా సంపాదన.. విచారిస్తే మరిన్ని అక్రమాలు?
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంలో వెలుగులోకి




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడే బడి వదిలేసి వ్యాపారాలు చేస్తూ, అనుమతి లేకుండా విదేశాల్లో విలాసాలు గడుపుతున్న ఘటన మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది.

**ఏం జరిగింది:**
బోనకల్ మండలం జానకీపురం కాంప్లెక్స్ పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బోధనను గాలికొదిలేసి రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ వ్యాపారాల్లో మునిగితేలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాఠశాలకు వచ్చినా పాఠాలు చెప్పకుండా చరవాణిలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ జీతానికి మించి వ్యాపారంలో రెట్టింపు ఆదాయం వస్తుండటంతో పూర్తిగా 'బిజినెస్ టీచర్'గా మారిపోయారన్న విమర్శలు ఉన్నాయి.

**దొంగచాటు ఫారిన్ టూర్లు:**
రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఏజెంట్‌గా పనిచేస్తూ లక్షల్లో ప్లాట్లు విక్రయించినందుకు ఆ సంస్థలు ఉచిత విదేశీ టూర్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు విదేశాలకు వెళ్లాలంటే విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే పలుమార్లు థాయిలాండ్ వెళ్లి వచ్చినట్లు ఆరోపణ. విదేశాల్లో ఉన్న సమయంలో కూడా ఎఫ్ఆర్ఎస్ లేకపోవడంతో పాఠశాలలో హాజరు వేసుకొని వేతనం డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది.

**స్థానిక అధికారుల సహకారం?**
ఈ వ్యవహారం ఇన్నాళ్లు బయటకు రాకపోవడానికి మండల విద్యాధికారి, జానకీపురం కాంప్లెక్స్ డీడీఓ సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోనే ఇలా జరగడం చర్చనీయాంశమైంది.

**డిమాండ్:**
అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లిన వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ రవాణాపై నిఘా

### చెక్ పోస్టులను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని అక్రమ రవాణాను అరికట్టడానికి, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతారం గ్రామం వద్ద, ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆమె పలు కీలక సూచనలు చేశారు. తనిఖీల్లో భాగంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుండి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 100 ద్వారా తెలియజేయాలి. ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ధరూర్ ఇన్స్పెక్టర్ రఘు రాములు, ఎస్.ఐ రాఘవేందర్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



**హాజరైన లోయపల్లి నర్సింగరావు**

**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్:** కామారెడ్డి నియోజకవర్గం రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేసి నిజమైన అర్హులైన పేదలకు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నో కుటుంబాలు0 ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలలను సాకారం చేస్తోందని అన్నారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలు కూడా పట్టణాల మాదిరిగా మంచి సౌకర్యాలతో జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి అధికారంలోకి తీసుకువచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు షబీర్ అలీ గారి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంమోహన్,స్థానిక సర్పంచ్ లత –శ్రీనివాస్,ఉప్పసర్పంచ్ దయానంద,మాజీ పి ఎ సి ఎస్ మాజీ చైర్మన్ స్వామి గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ పూలచంద్,మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి,కుక్కల రాజు,మాజీ జడ్పీటీసీ గ్యార సాయిలు,మాజీ ఎంపీటీసీ రేనా–చంద్రు నాయక్,మాజీ సర్పంచ్ మద్దెల రాజు,మాజీ ఉప్పసర్పంచ్ నవీన్ రెడ్డి,మాచారెడ్డి సర్పంచ్ సంతోష్ రెడ్డి,గొడుగుమర్రి తండా సర్పంచ్,రవి,ఉప్పసర్పంచ్ శంకర్, ఎల్లంపేట్ సర్పంచ్ లక్ష్మీరాజాం,నడిమి తాండ సర్పంచ్ కములు ,వెనుకతండా సర్పంచ్ స్వామి,బోడగుట్ట సర్పంచ్ సంతోష్,అంకిరెడ్డిపల్లి సర్పంచ్ శ్రీరామ్,గుంటితండా సర్పంచ్ శివాలాల్,సాయి కుమార్ గౌడ్,లడ్డు గౌడ్, రాహుల్ గౌడ్, ఎల్లంపేట్ 1వ వార్డ్ మెంబెర్ కసాల వికాస్ గౌడ్ , పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.



## ధాన్యం దిగుమతుల్లో జాప్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు అనుమతించొద్దు
- హమాలీల సమస్య ఉన్న చోట వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి
- రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలి
- నాగిరెడ్డిపల్లి బొంరాస్ పేట్ లోని ఐ కె పి, పి పి సి సెంటర్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ కె పి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు, అక్రమ కోతలు అనుమతించబోమని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే స్వీకరించాలని సూచించారు. లారీ రైస్ మిల్లుకు చేరిన 24 గంటల్లోపు ధాన్యం అన్‌లోడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. పీపీసీలు, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత ఇతర సమస్యలు ఉన్నచోట వెంటనే అవసరమైన చర్యలు తీసుకొని సమస్యను అధిగమించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా అన్‌లోడింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డి ఎం సి ఎస్ మురళి కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో సైనిక్‌పురి పార్క్ అభివృద్ధికి శ్రీకారం



**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, రాజముద్ర న్యూస్:** సైనిక్‌పురి పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సైనిక్‌పురి పార్క్ అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సైనిక్‌పురి పార్క్ పరిసరాల్లో వాష్‌రూమ్‌ల నిర్మాణం,సీసీ రోడ్డు అభివృద్ధి పనుల కోసం రూ.25 లక్షల నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సైనిక్‌పురి ప్రాంత అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. పార్క్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మహిళల టీ20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు

**మెల్‌బోర్న్, మే 13 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు బుధవారం జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ మోలినెక్స్‌ను ఎంపిక చేయగా, వైస్ కెప్టెన్‌గా ఆష్లే గార్డ్‌నర్ బాధ్యతలు చేపట్టనున్నారు. అనుభవజ్ఞులైన ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ వంటి స్టార్ ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించింది. ఈసారి ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు స్పిన్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పిన్నర్లు జార్జియా వేర్‌హామ్, అలానా కింగ్‌లకు జట్టులో స్థానం కల్పించారు. మరోవైపు ఫాస్ట్ బౌలర్ డార్సీ బ్రౌన్‌కు అవకాశం దక్కలేదు. ఆమె స్థానంలో 20 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ లూసీ హామిల్టన్‌ను ఎంపిక చేశారు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు జట్టు తరఫున ఆడిన గ్రేస్ హారిస్, ఎలీస్ పెర్రీ, సోఫీ మోలినెక్స్‌లకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం విశేషం. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ఈ టోర్నీలో గ్రూప్-1లో ఆస్ట్రేలియాతో పాటు భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. జూన్ 13న మాంచెస్టర్ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, భారత్ జట్లతో తలపడనుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్ట్రేలియా జట్టులో సోఫీ మోలినెక్స్, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, నికోలా క్యారీ, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, ఎలీస్ పెర్రీ, మేగన్ షట్, అన్నబెల్ సదర్లాండ్, జార్జియా వోల్, జార్జియా వేర్‌హామ్ చోటు దక్కించుకున్నారు. రిజర్వ్ వికెట్ కీపర్‌గా తాలియా విల్సన్‌ను ఎంపిక చేశారు.

# ఐపీఎల్ పేరిట సైబర్ మోసాలు



**హైదరాబాద్, మే 13 :** దేశవ్యాప్తంగా ఐపీఎల్ జోరు కొనసాగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు అభిమానులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ టికెట్లు, ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో వెయ్యికిపైగా నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు సైబర్ భద్రతా సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. కీలక మ్యాచ్‌ల సమయంలో టికెట్లు దొరకక ఇబ్బంది పడుతున్న అభిమానులు, ఉచిత ప్రసారం కోసం వెతుకుతున్న వారినే కేటుగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపింది. నివేదిక ప్రకారం నకిలీ ఐపీఎల్ టికెట్ల విక్రయాల కోసం ఆరు వందలకు పైగా నకిలీ డొమైన్లు, ఉచిత మ్యాచ్ ప్రసారం పేరుతో మరో నాలుగు వందలకు పైగా నకిలీ వెబ్‌సైట్లు ప్రస్తుతం చురుకుగా పనిచేస్తున్నాయి. ఈ వెబ్‌సైట్లు అచ్చం అసలు సంస్థల మాదిరిగానే కనిపించేలా రూపొందిస్తున్నారని, అధికారిక గుర్తులు, రంగులు, టికెట్ బుకింగ్ విధానాలను కాపీ చేసి అభిమానులను నమ్మిస్తున్నారని పేర్కొంది. సీట్లు ఎంపిక చేసుకోమని చెప్పి వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు సమాచారం సేకరించి అనంతరం యూపీఐ, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు చెల్లింపులు చేయిస్తున్నట్లు వెల్లడించింది. డబ్బులు చెల్లించిన తరువాత కొందరికి నకిలీ బుకింగ్ గుర్తింపు సంఖ్యలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లతో కూడిన పీడీఎఫ్ టికెట్లు కూడా పంపుతున్నారని తెలిపింది. తీరా స్టేడియం వద్దకు వెళ్లిన తరువాతే అది మోసమని బాధితులకు తెలుస్తోందని పేర్కొంది. మరోవైపు ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లింకులు కూడా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి లింకులు తెరిచిన వెంటనే అనుమానాస్పద అనువర్తనాలు డౌన్‌లోడ్ కావడం, వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సైబర్ భద్రతా నిపుణులు అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టికెట్లు కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ నిజమైనదో కాదో తప్పనిసరిగా పరిశీలించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవొద్దని హెచ్చరించారు. కేవలం అధికారిక వేదికల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని, ఉచిత ప్రసారం పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

# హర్భజన్ భద్రతపై హైకోర్టు ప్రశ్నలు



**చండీగఢ్, మే 13 :** భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్‌కు కేటాయించిన భద్రతా సిబ్బందిపై పంజాబ్, హర్యానా హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. అధికారికంగా అనుమతించిన సంఖ్యకు మించి పోలీసు సిబ్బందిని ఎలా నియమించారో వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జగ్మోహన్ భన్సల్, అధికారిక రికార్డుల ప్రకారం హర్భజన్ సింగ్‌కు కేవలం ఎనిమిది మంది భద్రతా సిబ్బందికే అనుమతి ఉందని పేర్కొన్నారు. అయితే అదనంగా మరో 15 మంది పోలీసులను అనధికారికంగా విధుల్లోకి ఎలా పంపారో స్పష్టంచేయాలని ప్రశ్నించారు. జిల్లాల వారీగా భద్రతా సిబ్బంది కేటాయింపులపై లెక్కలు సమర్పించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు కోర్టు పేర్కొంది. ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా ఎంతమంది పోలీసులు భద్రతా విధుల్లో ఉన్నారో పూర్తి వివరాలు సమర్పించాలని భద్రతా అదనపు డైరెక్టర్ జనరల్, మోహా జిల్లా పోలీసు అధికారి కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివరాలపై వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది. అలాగే పిటిషనర్‌కు లేదా ఆయన కుటుంబ సభ్యులకు ఎటువంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ప్రజాధనంతో వీఐపీ భద్రత పేరిట అధిక సంఖ్యలో పోలీసులను వినియోగిస్తున్న అంశంపై కూడా కోర్టు ఆరా తీసింది. ఇక హర్భజన్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో తన భద్రతను అకస్మాత్తుగా తగ్గించారని, తనకు ఉన్న ముప్పును సమీక్షించకుండా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణను కోర్టు మే 20కి వాయిదా వేసింది.

# కోహ్లీ విశ్వరూపం!

**అజేయ శతకంతో చెలరేగిన విరాట్.. ■ రాయల్ ఛాలెంజర్స్ ఘనవిజయం**


**రసవత్తర పోరులో కోల్ కతాపై గెలుపు.. ■ పట్టికలో అగ్రస్థానానికి బెంగళూరు**



**రాయ్‌పూర్:** ఐపీఎల్‌లో భాగంగా షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్)పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత విజయం సాధించింది. వర్షం కారణంగా గంట ఆలస్యంగా ప్రారంభమైన ఈ రసవత్తర పోరులో బెంగళూరు 6 వికెట్ల తేడాతో కోల్‌కతాను చిత్తు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ శతకంతో చెలరేగి ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ అద్భుత విజయంతో బెంగళూరు పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానానికి (టేబుల్ టాపర్) దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు కేవలం 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 194 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. బెంగళూరు బ్యాటర్లలో విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీతో కదంతొక్కగా.. దేవ్ దత్ పడిక్కల్ రాణించాడు. బౌలింగ్ లో కార్తీక్ త్యాగి 3 వికెట్లు తీసి కోల్ కతాను కట్టడి చేశాడు.

### రఘువంశీ, రింకూల జోరు..

టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుందనే అంచనాలతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన కోల్ కతాకు యువ కెరటం అంగ్ క్రిష్ రఘువంశీ అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. బెంగళూరు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మైదానం నలువైపులా షాట్లు బాదాడు. 46 బంతుల్లోనే 71 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. అతనికి తోడుగా విధ్వంసక బ్యాటర్ రింకూ సింగ్ ఆఖర్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 29 బంతుల్లోనే అజేయంగా 49 పరుగులు బాది స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ సైతం 24 బంతుల్లో 32 పరుగులు సాధించి చక్కటి సహకారం అందించడంతో కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెంగళూరు బౌలర్లలో యువ పేసర్ కార్తీక్ త్యాగి 32 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి కోల్ కతాను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. సునీల్ నరైన్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు.



### ఛేదనలో కింగ్ కోహ్లీ గర్జన..

193 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. లక్ష్యం పెద్దది కావడంతో తొలి బంతి నుంచే బాధ్యతాయుతంగా ఆడుతూనే వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు తరలించాడు. కోల్ కతా బౌలర్లు వికెట్లు తీసేందుకు ప్రయత్నించినా కోహ్లీ ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. కేవలం 60 బంతుల్లోనే అజేయంగా 105 పరుగులు సాధించి 'ఛేజ్ మాస్టర్' అనిపించుకున్నాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన దేవ్ దత్ పడిక్కల్ సైతం అద్భుతమైన షాట్లతో అలరించాడు. 27 బంతుల్లోనే 39 పరుగులు సాధించి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. చివర్లో జాకబ్ బెథెల్ 12 బంతుల్లో 15 పరుగులు చేయడంతో బెంగళూరు 19.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. కోల్ కతా బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 34 పరుగులిచ్చి 1 వికెట్, జోష్ హేజిల్ వుడ్ 35 పరుగులిచ్చి 1 వికెట్, రసిఖ్ సలామ్ 35 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా బెంగళూరు విజయాన్ని ఆపలేకపోయారు.

### అగ్రస్థానంలో రాయల్ ఛాలెంజర్స్..

ఈ సంచలన విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మొత్తం 12 మ్యాచ్ లు ఆడిన బెంగళూరు 8 విజయాలు, 4 పరాజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్ గా నిలిచింది. రన్ రేట్ సైతం ప్లస్ 1.053 కు పెరిగింది. నిన్నటి వరకు అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ (16 పాయింట్లు, రన్ రేట్ ప్లస్ 0.551) మెరుగైన రన్ రేట్ కారణంగా రెండో స్థానానికి పడిపోయింది. మరోవైపు సన్ రైజర్స్ హైదరాబాద్ 14 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ పోరులో ఓడిన కోల్ కతా నైట్ రైడర్స్ మొత్తం 11 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 6 పరాజయాలతో 9 పాయింట్లకే పరిమితమై పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. లీగ్ దశ ముగింపుకు వస్తున్న తరుణంలో అద్భుత విజయంతో బెంగళూరు ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది.

# సోషల్ మీడియాలో కోహ్లీ హవా

### ఆడకపోయినా ధోనీ క్రేజ్ తగ్గలేదు






**ముంబై, మే 13 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ పోరును తలపిస్తోంది. ఒకవైపు మైదానంలో ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనలతో అలరిస్తుంటే, మరోవైపు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చలు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బెంగళూరు జట్టు, హైదరాబాద్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. పంజాబ్ జట్టు కూడా 13 పాయింట్లతో రేసులో నిలిచింది. ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన సోషల్ మీడియా విశ్లేషణ ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చించబడిన క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం చర్చల్లో 44 శాతం వాటాతో కోహ్లీ సోషల్ మీడియాను శాసిస్తున్నాడు. అతని బ్యాటింగ్‌తో పాటు మైదానంలో చూపించే దూకుడు అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. అయితే ఈ జాబితాలో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన విషయం మహేంద్ర సింగ్ ధోనీ రెండో స్థానంలో నిలవడమే. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో ధోనీ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా కొనసాగుతున్నాడు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే గాయంతో సీజన్‌కు దూరమైనప్పటికీ, అభిమానుల్లో ఆయనపై ఉన్న అభిమానమే ఈ స్థాయి క్రేజ్‌కు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. రాజస్థాన్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లో సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల భారీ అభిమాన వర్గం కారణంగా టాప్ జాబితాలో చోటు దక్కలేదు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ధోనీ ఆడితే చూడాలని ఉందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# కేన్స్‌లో అలియా మెరుపులు

కేన్స్, మే 13 : ప్రపంచ సినీ, ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షించే ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివియేరా వేదికగా జరిగిన ఈ వేడుకలో ఉదయం నుంచే కలల ప్రపంచాన్ని తలపించే అందంతో కనిపించిన అలియా.. సాయంత్రం రెడ్ కార్పెట్‌పై మరింత గ్లామ-రస్‌గా మెరిసి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు. లొరియల్ పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా కేన్స్ రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన అలియా.. ప్రముఖ డిజైనర్ తమారా రాల్ఫ్ రూపొందించిన ప్రత్యేక గౌన్‌లో కనిపించారు. లేత గులాబీ రంగులో రూపొందించిన ఈ స్ట్రాప్‌లెస్ గౌన్ ఆమెకు అద్భుతమైన ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ గౌన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన నెక్‌లైన్, కార్సెట్ శైలిలో ఉన్న బాడిస్ ఆమె ఫిట్‌నెస్‌ను మరింత హైలైట్ చేశాయి. అలాగే చేతుల చుట్టూ దుపట్టా తరహాలో అమర్చిన డ్రేప్ మొత్తం లుక్‌కు భారతీయ శైలిని జోడించింది. పాశ్చాత్య ఫ్యాషన్‌లో భారతీయతను మేళవించిన ఈ డిజైన్ ఫ్యాషన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. అలియా మినిమల్ ఆభరణాలు, సాఫ్ట్ మేకప్, సాధారణ హెయిర్ స్టైల్‌తో ఎంతో రాయల్‌గా కనిపించారు. ఆమె చిరునవ్వు, ఆత్మవిశ్వాసం మొత్తం లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ప్రస్తుతం కేన్స్‌లో అలియా చేసిన ఈ స్టైల్ స్టేట్‌మెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అభిమానులతో పాటు ఫ్యాషన్ విమర్శకులు కూడా అలియా లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. భారతీయ సాంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్‌తో మేళవిస్తూ అలియా మరోసారి గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా తన స్థాయిని నిరూపించుకున్నారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా కేన్స్ వేదికపై భారతీయ నటీమణులు తమ ప్రత్యేక ఫ్యాషన్ స్టైల్స్‌తో ఆకట్టుకుంటుండగా.. ఈసారి అలియా భట్ తన సొగసైన రెడ్ కార్పెట్ లుక్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# బన్నీతో మరోమారు పూజ




బుట్టబొమ్మ పూజా హెగ్డేకు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ఫ్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్.. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.

# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది

ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.





# రొమాంటిక్ లుక్స్‌తో ఎస్తర్ అనిల్


**హైదరాబాద్, మే 13 :** బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించి, ఇప్పుడు కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ఎస్తర్ అనిల్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ మరియు రొమాంటిక్ లుక్స్‌లో కనిపించిన ఎస్తర్ అనిల్ ఫోటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో నటిగా మంచి గుర్తింపు సంపాదించిన ఎస్తర్ అనిల్, ముఖ్యంగా 'దృశ్యం' సిరీస్ ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన మలయాళ 'దృశ్యం' చిత్రంలో అనుమోల్ పాత్రలో నటించిన ఆమె, ఆ తర్వాత అదే పాత్రను తెలుగు రీమేక్‌లో వెంకటేష్ కుమార్తెగా పోషించి తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందారు. కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఆ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఎస్తర్ అనిల్ 2010లో విడుదలైన 'నల్లవన్' చిత్రంతో బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. అనంతరం 'దృశ్యం', 'దృశ్యం 2', తమిళంలో 'పాపనాసం' వంటి చిత్రాలతో దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చిన్న వయసులోనే సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు అనేక అవకాశాలు వచ్చాయి. ఇక హీరోయిన్‌గా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఎస్తర్, 'జోహార్' వంటి చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో నటించారు. నటనలో ప్రతిభ కనబరిచిన ఆమెకు 2016లో ఉత్తమ బాలనటిగా కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డు లభించింది. ప్రస్తుతం లండన్‌లో మాస్టర్స్ చదువుతూనే సినిమాల్లో నటిస్తూ విద్య, కెరీర్‌ను సమతుల్యం చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉండే ఎస్తర్ అనిల్, తన కొత్త ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటుంటారు. తాజాగా విడుదల చేసిన రొమాంటిక్ స్టైల్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందం, స్టైల్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అరుంధతితో స్టార్‌డమ్

## అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 13 : దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటీమణుల్లో అనుష్క శెట్టి ఒకరు. గ్లామర్ పాత్రలతో పాటు కథానాయిక ప్రాధాన్య చిత్రాల్లోనూ తనదైన ముద్ర వేసిన ఆమె, పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. 'సూపర్' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన అనుష్క, తర్వాత వచ్చిన 'అరుంధతి' చిత్రంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారిపోయారు. అనంతరం 'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు పొందారు. అసలు పేరు స్వీటి శెట్టి అయిన అనుష్కకు సినీ రంగంలోకి వచ్చిన తర్వాత దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో నాగార్జున కలిసి "అనుష్క" అనే పేరును పెట్టినట్లు తెలిసిందే. సినిమాల్లోకి రాకముందు ఆమె యోగా శిక్షకురాలిగా పనిచేశారు. 2005లో విడుదలైన 'సూపర్' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన అనుష్క, ఆ తర్వాత దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'విక్రమార్కుడు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2009లో విడుదలైన 'అరుంధతి' చిత్రం ఆమె కెరీర్‌కు కీలక మలుపు తిప్పింది. దర్శకుడు కోడి రామకృష్ణ రూపొందించిన ఈ ఫాంటసీ చిత్రంలో జేజమ్మ పాత్రలో అనుష్క నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు గాను ఆమెకు నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, ఫిలింఫేర్ ఉత్తమ నటి పురస్కారాలు దక్కాయి. అనంతరం 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాలతో తన ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ పాత ఇంటర్వ్యూలో అనుష్క తన వ్యక్తిగత జీవితం, సహచర నటీనటుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తనకు ఇష్టమైన హీరోయిన్లలో త్రిష, నయనతార ఉన్నారని తెలిపారు. అలాగే నటి భూమిక చావ్లాను కుటుంబ సభ్యురాలిలా భావిస్తానని చెప్పారు. హీరోల విషయానికి వస్తే, నాగార్జున చాలా పాజిటివ్ వ్యక్తి అని, సుమంత్తో కలిసి పని చేయడం ఎంతో సౌకర్యంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత బలహీనత గురించి మాట్లాడుతూ, ఫోన్‌ను తరచుగా సైలెంట్‌లో పెట్టడం వల్ల చాలాసార్లు అందుబాటులో ఉండనని, అదే తనపై ఎక్కువగా వచ్చే ఫిర్యాదని నవ్వుతూ చెప్పారు. తన జీవితంలో వచ్చిన తొలి ప్రేమ ప్రతిపాదన గురించి కూడా అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆరో తరగతిలో చదువుతున్న సమయంలో ఒక సహాధ్యాయి "నువ్వంటే నాకు ఇష్టం" అని చెప్పాడని, దానికి తాను కూడా "ఓకే" అని సమాధానం ఇచ్చినట్లు సరదాగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సినిమాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, అనుష్కకు ఉన్న క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.





Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com